ప్రశాంతంగా మండల గణిత శాస్త్ర పరీక్షలు

విశాలాంధ్ర - నరసన్నపేట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బోర్డు)లో ఆదివారం మండల స్థాయి సిక్కోలు గణిత శాస్త్ర పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాలకు చెందిన సుమారు 84మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరైనారు. ఈ పరీక్ష ఫలితాలు ఈనెల 18వ తేదీన విడుదలవుతాయి. ఈ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు సిక్కోలు జిల్లా స్థాయి గణిత పరీక్షలకు అర్హులవుతారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులకు సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రధానోపాధ్యాయురాలు, వకుళ రత్నమాల బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బి.కేశవరావు, శైలజ, నాగేశ్వరరావు, జయకృష్ణ, నూకరాజు, గురునాధం, ఆదినారాయణ, బాబా మాస్టర్, రవికుమార్, వాసుదేవరావు, చిన్ని కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు ఖాదీకి జీఐ ట్యాగింగ్ రావడం ఎంతో ఆనందంగా ఉంది

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : మహాత్ముడే మెచ్చిన పొందూరు ఖాదీకి జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ (జీఐ) (1049) ట్యాగ్ ఇస్తూ, కేంద్రం నిర్ణయం వెలువరించడం అన్నది తనకు ఎంతో ఆనందంగా ఉందని, ఇందుకు సంబంధించి పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషి ఎంతగానో ఉండడం ఆనందంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా ఈ విషయమై రామ్మోహన్ నాయుడు విశేష కృషి చేస్తున్నారని, కేంద్రం సానుకూలంగా స్పందించి పొందూరు ఖద్దరుకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు దక్కేలా నిర్ణయం వెలువరించడం కూటమి ప్రభుత్వం విజయంగా అభివర్ణించారు. జీఐ ట్యాగ్.. తో నకిలీలు నివారించవచ్చని, అలానే నేతన్నల వస్త్రాల ఎగుమతులు ఇకపై సులభ సాధ్యమని అభిప్రాయపడ్డారు. జిల్లాలో ఉన్న పొందూరు ఖాదీకి స్వాతంత్రం పూర్వం ముందు కూడా ఎంతో గుర్తింపు ఉందని , అటువంటి విస్తృత స్థాయిలో గుర్తింపు పొందిన ఖాదీకి భౌగోళిక గుర్తింపు రావడం శుభ పరిణామం అని అన్నారు. జీఐ ట్యాగ్ ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుదలకూ, ఖాదీ వస్త్రాల బ్రాండింగ్ కు మరిన్ని అవకాశాలు దక్కుతాయని అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో నేతన్నలకు సుదీర్ఘ కాలంగా జీఐ ట్యాగ్ విషయమై ఉన్న కల సాకారం కావడం ఓ గొప్ప మలుపు అని అన్నారు. ఇందుకు ఎంతో సహకరించిన ఆర్థిక శాఖామాత్యులు నిర్మలా సీతారామన్ కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు. మోదీ ప్రభుత్వం ఏర్పడ్డాక గతంలో ఎన్నడూలేని విధంగా స్థానిక ఉత్పత్తులకు దేశీయ మార్కెట్లోనే కాకుండా అంతర్జాతీయ విపణిలో కూడా బ్రాండింగ్ కల్పించడంతో ఇకపై పొందూరు ఖాదీకి విస్తృత స్థాయి గుర్తింపు తద్వారా నేతన్నలకు గౌరవం దక్కుతాయని తెలిపారు.

సాయి శీరీష పాఠశాల ఔదార్యం

రూ. 1.44 లక్షలు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీ బుగ్గ పరిధి చినబడాంలో గల సాయి శీరిష పాఠశాల విద్యార్థులు తమ ఔదా ర్యంను చాటుకున్నారు. వజ్రపు కొత్తూరు మండలం హుకుంపేట గ్రామానికి చెందిన వంక కృష్ణారావుకు సాయి శీరీష విద్యార్థులు చందాలు వేసుకుంటూ వసూలు చేసిన మొత్తాన్ని పాఠశాల కరస్పాండెంట్ కవిటి భారతి, రేణుకేశ్వర రావు బాధిత కుటుంబ సభ్యులకు రూ. 1.44 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. సాయి శీరీష పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న వంక లిఖిత్ కుమార్ తండ్రి వంక కృష్ణారావుకు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం శ్రీకాకుళం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం, తోటి విద్యార్థులు నడుంబిగించి చందాలు వేసుకుంటూ రూ. 1.44 లక్షల రూపాయలు ఆర్థిక సహాయంను అందజేసారు.

జనసేన కార్యకర్త అనిపించుకోవడంలో సంతృప్తి

ఎమ్మెల్సీ, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు

విశాలాంధ్ర - లావేరు : జనసేన ప్రధాన కార్యదర్శిగా కంటేకూడా జనసేన కార్యకర్త అనిపించుకోవడంలోనే చాలా సంతృప్తిగా ఉంటుందని, జన సైనికులకు, వీరమహిళలకు సామాజిక గౌరవం ఎక్కువగా ఉంటుందని, జనసేన ప్రయాణంలో ముందుండి పనిచేసిన 2 వేల మందికి పైగా కార్యకర్తలకు, నాయకులకు జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అనేక నామినేటెడ్ పదవులతో గౌరవించారని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ అధ్యక్షతన ఎచ్చెర్ల పార్టీ కార్యాలయంలో శనివారం, ఆదివారం జరిగిన జనసేన కార్యకర్తల జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో కె నాగబాబు మాట్లాడుతూ ఎమ్మెల్సీ హెూదాలో ఏదైనా నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎంచుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎచ్చెర్ల నియోజకవర్గం ఎంచుకున్నట్లు, ఇకపై ఎక్కువ సమయం ఎచ్చెర్లలో కార్యకర్తలకు, ప్రజలకు అందు బాటులో ఉంటానని వెల్లడించారు. కూటమి పొత్తు ధర్మంలో భాగంగా స్థానికి శాసనసభ్యులు ఎన్ ఈశ్వరరావు సహకారంతో ఎచ్చెర్ల అభివృద్ధి కోసం పని చేస్తానని అన్నారు. సాధారణ కార్యకర్త నుండి అత్యున్నత నాయకత్వ స్థాయికి ఎదిగే అవకాశం కేవలం జనసేన పార్టీలోనే ఉంటుందని, నిబద్ధత, నిజాయితీ గల నాయకులు పవన్ కళ్యాణ్ అడుగు జాడల్లో నడిచే ప్రతి ఒక్కరికీ మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. ఎచ్చెర్ల నియోజకవర్గంతో పాటు ఉత్తరాంధ్రలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలకొండ శాసన సభ్యులు నిమ్మక జయకృష్ణ, నెలిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నియోజక వర్గాల సమన్వయకర్తలు యస్ విశ్వక్షేన్, పేడాడ రామ్మోహన్, పొగిరి సురేష్ బాబు, కణితి కిరణ్ కుమార్, గేదెల చైతన్య, దాసరి రాజు, బలగ ప్రవీణ్ కుమార్, వేగులాడ దుర్గారావు, కోరాడ సర్వేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు శ్రీ గర్భాన సత్తిబాబు, లొల్ల రాజేష్, నిమ్మల నిబ్రమ్, జనసేనపార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు దుర్యోధనరెడ్డి, హరి బెహరా, జిల్లా ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు మరియు జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా కేంద్రంలో విస్తృతస్థాయి సమావేశం

విశాలాంధ్ర - కవిటి : శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని టౌన్ హాల్లో నేడు (సోమవారం) వైసిపి విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ నర్తు రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన క్యాంప్ కార్యాలయం కొత్తపుట్టుగలో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేట్ పరం కాకుండా ఉండాలని జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని సేకరించిన కోటి సంతకాల ప్రతులను జిల్లా కేంద్రం నుండి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించే క్రమంలో డిసెంబర్ 15 తేదీ ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం టౌన్ హాల్ నందు జిల్లా పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఇచ్ఛాపురం నియోజకవర్గం పార్టీ ముఖ్య నాయకులు, సోషల్ మీడియా సభ్యులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎంసీకి శాశ్వత బిల్డింగ్ నిర్మించండి : చైర్మన్ మామిడి రామకృష్ణ

విశాలాంధ్ర - హిరమండలం : మూడు మండలాలు ఎల్ ఎన్ పేట కొత్తూరు హిరమండలం మండలాల కు చెందిన హిరమండలం మార్కెట్ కమిటీ కార్యాలయానికి శాశ్వతం బిల్డింగ్‌ను నిర్మించాలని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్‌ను హిర మండలం ఎఎంసి చైర్మన్ మామిడి రామకృష్ణ కోరారు. శనివారం విశాఖపట్నం లో జరిగిన సమావేశంలో ఏఎంసి చైర్మన్ రామకృష్ణ పాల్గొని డైరెక్టర్ తో మాట్లాడారు. రైతులు ఎన్నో సమస్యలు ను ఎదుర్కొంటున్నారని అద్దె భవనంలో కార్యాలయం కొనసాగుతుందని పండించిన పంటలు దాచుకోనేందుకే గిడ్డంగులు కూడా లేవని తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించారని రామకృష్ణ విశాలాంధ్రకు వెల్లడించారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడు పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. గ్రా మాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేయాలని సూచించారు.ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంత్రి స్పష్టం చేశారు. ఆదివారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులకు పలు సూచనలు జారీ చేస్తూ, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తాగునీరు, రహదారులు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్. ఆకెళ్ళ ఫణిబాబుకు జ్యోతిష్య అవార్డు

విశాలాంధ్ర - రణస్థలం : మండలంలో ఆదివారం రోజున పూరీ, ది ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్, అమెరికా వారు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన సభలో పాల్గొని లి"దివ్యజ్ఞాన మరియు దైవిక వారసత్వం" "జ్యోతిష్య శాస్త్రం మరియు ఆధ్యాత్మిక స్పృహ మధ్య విశ్వ సంబంధాన్ని అన్వేషించడం" అనే అంశంపై ఉపన్యసించినందుకు గాను ఆయనకు " జ్యోతిష్ వశిష్ట ' అనే అరుదైన అవార్డు లభించింది. ఆయనకు ఈ అవార్డు వచ్చినందుకు గాను కుటుంబ సభ్యులు మరియు బంధు మిత్రులు అందరూ కూడా ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఆయన ఇలాంటి అవార్డులు ఇంకా ఎన్నో సాధించాలని కోరుకుంటున్నారు.

గిరిజనుల గొంతుక కమ్యూనిస్టు పార్టీ

విశాలాంధ్ర - సోంపేట : వారి కష్టాలు బాధల్లో నిరంతరం అలుపెరుగని పోరాటం సాగిస్తూ గిరిజన ప్రజల గొంతుకగా భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లుగా పోరాటం సాగిస్తుందని జిల్లా కార్యవర్గ సభ్యులు సాలిన నారాయణస్వామి, పుక్కళ్ళ అరేలమ్మ పేర్కొన్నారు. సిపిఐ పార్టీ పొందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో కంచిలి మండలం కుమ్మరి నౌగాం పంచాయతీ భువనపురం గ్రామంలో ఆదివారం సీనియర్ కామ్రేడ్ భువన ప్రధాన్ చేతుల మీదుగా ఎర్రజెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ జల్ జమీన్ జంగల్ పేరుతో భారతీయ కమ్యూనిస్టు పార్టీ చేపట్టిన పోరాటాలను గుర్తు చేశారు. ఇదే స్ఫూర్తితో పేద వర్గాలకు భాసటగా నిలిచి పోరాటాలు ఉధృతం చేస్తామని అన్నారు.

సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్సీ నర్తు పరామర్శ

విశాలాంధ్ర - కవిటి : ఇటీవల మృతి చెందిన బైరిపురం గ్రామ సర్పంచ్ పుల్లట రమాదేవి, బెలగాం మాజీ సర్పంచ్ దుపాన నేతాజీ సతీమణి దుపాన ఢిల్లమ్మ,లండారిపుట్టుగ గ్రామనికి చెందిన మామిడి లోకనాథం కుటుంబాలకు ఎమ్మెల్సీ నర్తు రామారావు పరామర్శించారు. వారి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ నర్తు శేషాగిరి, వల్లభరావు, మద్దిలి ఈశ్వరరావు, గిరి, సుదర్శన్, మాధవరావు, పాపారావు,తుంబయ్య తదితరులు పాల్గొన్నారు.

65 మందికి కంటి పరీక్షలు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఉచితకంటి వైద్య శిబిరంలో 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. విజనగరంకు చెందిన శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో సంతబొమ్మాళి మేజర్ పంచాయతీ సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి అప్పారావు పర్యవేక్షణలో జరిగిన ఈశిబిరంలో కంటి పరీక్షలు జరిపారు. ఉచితంగా మందులు అందించారు. అలాగే 25 మందికి కళ్ళజోళ్లు అందించగా, 17 మందికి కళ్ల ఆపరేషన్ కోసం తీసుకు వెళ్లారు. ఆసుపత్రి కో ఆర్డినేటర్ ఎం.హరిబాబు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఈ శిబిరం లో వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌ని మర్యాదపూరకంగా కలిసిన రాష్ట్ర బీజేపీ జనరల్ సెక్రెటరీ



విశాలాంధ్ర - రణస్థలం : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్)ని బీజేపీ జనరల్ సెక్రటరీ మట్టా ప్రసాద్ మర్యాదపూరకంగా కలిశారు. ఆయన వెంట పైడి వేణుగోపాలం, సిరిపురం రాజేశ్వరరావు ఉన్నారు.

జిల్లాలో యూనియన్‌ని బలోపేతం చేయాలి

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు

విశాలాంధ్ర - టెక్కలి : ఏపీయూడబ్ల్యూజే జిల్లాలో బలోపేతానికి అందరూ కృషి చేయాలని ఏపీ యూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఐవి సుబ్బారావు అన్నారు. పలాస నుండి విశాఖపట్నం వెళుతున్న పర్యటనలో భాగంగా ఆయనను టెక్కలి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బెండి నర్సింగరావు ఆధ్వర్యంలో సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి దుస్సాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా జిల్లాలో యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. అక్రిడేషన్ పై చర్చలు జరుగుతున్నాయని త్వరలోనే అందరికీ వచ్చేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే మరియు ఐజేయు కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు, యన్ ఈశ్వరరావు, కుంచు చిన్నారావు, చౌదరి సత్యనారాయణ, చైతన్య మరియు టెక్కలి ఉపాధ్యక్షులు గుంట చంద్రశేఖర రావు, నర్సిపురం శేఖర్, శ్రీధర్, రమేష్, తేజేశ్వరరావు, సోమేశ్వరరావు, దుర్యోధన, శ్రీధర్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

వైకుంఠ ఏకాదశి, రథసప్తమి ఏర్పాట్లపై ఆరా తీసిన కేంద్రమంత్రి

విశాలాంధ్ర - గార/శ్రీకాకుళం : కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దంపతులు.. తమ కుమారుడు శివాన్ ఎర్రంనాయుడుతో కలసి ఆదివారం నాడు శ్రీకాకుళం లోని ప్రముఖ సూర్య దేవాలయం అరసవల్లి ఆదిత్యుని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన కేంద్ర మంత్రిని వేద మంత్రోచ్ఛారణ, మంగళ వాయిద్యాల నడుమ పూర్ణ కుంభ స్వాగతాన్ని పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని వినాయక, శైవ క్షేత్రాలను ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అనివెట్టి మండపంలో వేద ఆశీర్వాదాన్ని, సూర్యదేవుని చిత్రపటాన్ని అర్చక బృందం, దేవా దాయ శాఖ అధికారులు అందించారు. ఈ సందర్భంగా త్వరలో జరగబోయే వైకుంఠ ద్వార దర్శనం, రథసప్తమి ఉత్సవ ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా వైభవంగా నిర్వహించాలని అదేశించారు. అరసవల్లి సూర్యదేవుని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, ఎప్పుడూ ఆ ఆదిత్యుని తలచుకున్నా.. విశేష మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. దేశ ప్రజలందరికీ భాస్కరుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

28 తేదీన జిల్లా స్థాయి ఒడియా గణిత ప్రతిభ పరీక్ష

విశాలాంధ్ర - కవిటి : ఆంధ్రప్రదేశ్ ఒడియా ఉపాధ్యాయ అసోసియేషన్ (ఆపోటా) అధ్వర్యంలో ఒడియా గణిత ఉపాద్యాయుల వేదిక సహ కారంతో జిల్లా స్థాయి ఒడియా గణిత ప్రతిభ పరీక్ష ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఒడియా మాధ్యమం 8, 9, 10 తరగతుల పిల్లలకు ఇచ్ఛాపురం, సోంపేట, మందస, పలాస, మెళియాపుట్టి, టెక్కలి, బత్తిలి ఉన్నత పాఠశాలలో డిసెంబర్ 28 తేదీన నిర్వహిస్తున్నట్లు ఆపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దోళాయి తెలిపారు.ప్రతి తరగతికి చెందిన 7 గురు విద్యార్థుల పేర్లు ప్రతి ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాల నుండి తప్పకుండా సంబంధిత మండల ఆపోటా అధ్యక్ష, కార్యదర్శులకు పంపించాలని అలాగే 8, 9 తరుగతులకు సెమిస్టర్-1 పుస్తకం నుండి 10 తరగతి పిల్లలకు సమ్మేటివ్ -1 పరీక్ష సిలబస్ నుండి ప్రశ్నలు వస్తాయని, పరీక్ష 50 మార్కులకు ఓఎంఆర్ సిట్ ఇవ్వబడుతుందని, పరీక్ష విజయవంతంగా నిర్వహించడానికి అందరు సహకారించాలని ఆయన కోరారు.

చిన్నారులకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కవిటి : తల్లిదండ్రులను కోల్పోయి నిరాశ్రయులైన బి.గొనపపుట్టుగ గ్రామానికి చెందిన చిన్నారులకు భైరిపురం గ్రామ ప్రజలు (స్నేహబంధంతో సాధ్యం కానిదేది లేదని నిరూపించిన పలువురు మిత్రులు) ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. గొన పపుట్టుగ గ్రామానికి చెందిన బడగల శివాజీ, కళావతి దంపతులు కిడ్నీ వ్యాధి బారిన పడి మృతి చెందారు.విషయం తెలుసుకున్న కొందరు మిత్రులు, భైరిపురం గ్రామ ప్రజలు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ ఆర్థిక సహాయం అందజేసిన పిరియా రాజగోపాలంకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. మొత్తం రూ.1,03000 ఫిక్స్ డిపాజిట్ మరియు రూ.5,500 నగదు, రూ.2 వేలు నిత్యావసర వస్తువులు రూపంలో ఆ కుటుంబానికి అందజేశారు. మరింత మంది దాతలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకు వచ్చి ఆ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేయాలని కోరారు.

గణిత శాస్త్రంలో ఎన్. జగన్నాధంకు డాక్టరేట్

విశాలాంద్ర - సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం వడ్డివాడ గ్రామానికి చెందిన ఎన్. జగన్నాధం కు ఆదివారం గుణుపూర్ లోని గైట్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టరేట్ ను ప్రదానం చేశారు.ఈయన గణిత శాస్త్రంలో డా. బిప్లబ కుమార్ రథ్, ప్రొఫెసర్, డా. దిల్లిప్ కుమార్ సహ పర్యవేక్షణలో "డస్టీ ఫ్లూయిడ్‌లో మాగ్నెటిక్ ఫీల్డ్ మరియు ఎలక్ట్రిక్ ఫీల్డ్ యొక్క ప్రభావాలపై అధ్యయనం" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించగా డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీ ను ప్రదానం చేసినట్లు యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈయన రాసిన పరిశోధనా వ్యాసాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈసందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, మరియు ఇతర అధ్యాపకులు అభినందనలు తెలిపారు. ఈయన ప్రస్తుతం సహాయ ఆచార్యులుగా అదే యూనివర్సిటీలో పని చేస్తున్నారు. డాక్టరేట్ వచ్చిన సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

- శ్రీ సత్య సాయిబాబా సేవ సమితి ప్రతినిధులు - కంటి ఆపరేషన్‌లకు 28 మంది ఎంపిక

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఉచిత కంటి వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సంతబొమ్మాళి మండలం బోరుభద్ర శ్రీ సత్యసాయిబాబా సేవసమితి కన్వీనర్ గుడ్ల నాగభూషణరావు, సేవా సమితి ప్రతి నిధులు బుసకల సీతారాం, ధర్మవరపు అప్పారావు అన్నారు. బోరుభద్రలో సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలలో భాగంగా స్థానిక సేవాసమితి ఆధ్వర్యంలో విజయనగరం కు చెందిన పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 120 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 28 మందిని కంటి ఆపరేషనుల కోసం ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కోఆర్డినేటర్ లక్ష్మణ్, వైద్యాధికారి డాక్టర్ పూజిత, స్థానిక సాయిబాబా సేవా సమితి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలో భారీ చేరికలు

పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర- కోటబొమ్మాళి : శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కోటపాడు, వడ్డితాండ్ర పంచాయతీలకు చెందిన నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఆదివారం నిమ్మాడలోని క్యాంప్ కార్యాల యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు కొత్తగా చేరిన వారికి పసుపు కండువాలు కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని, అందుకే వివిధ గ్రామాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు.మష్టి కృషితోనే గ్రామాభివృద్ధి సాధ్యమని, మంత్రిగా తనవంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు, కోటపాడు పంచాయతీ మాజీ సర్పంచి అప్పల రాజు, రెడ్డి అప్పన్న, తదితరులు ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరిక కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణాలకు ఎదురుచూస్తున్న గిరిజనులు..!

రాజకీయ పార్టీల ఎన్నికల హామీలకే పరిమితమా..?

విశాలాంధ్ర - మందస : మండలంలో గిరిజన గ్రామాలకు.. గిరిజనేతరులు నివసిస్తున్న గ్రామాలకు పూర్తిస్థాయి రహదారులు.. వంతెనలు లేవు.. దీంతో గిరిజనులు గిరిజనేతర ప్రజలు అష్ట కష్టాలు అనుభవిస్తున్నారు. తుఫాన్ లు వచ్చే సమయంలో బయట ప్రపంచంతో ఈ గ్రామాలకు సంబంధాలు పూర్తిగా తెగిపోతాయి. అత్యవసర సమయాల్లో వైద్య సదుపాయాలు కూడా అందే పరిస్థితిలో లేకపోవడంతో అనేక మంది ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ గ్రామాల పరిధిలో ఉన్న విద్యార్థులు ఉన్నత విద్యా సంస్థలకు వెళ్లాలన్న కష్టాలు తప్పడం లేదని ఆందోళన చెందుతున్నారు. మందస మండలంలో ఇటువంటి పరిస్థితి అధిక శాతం ఉంది. వంతెనలు రహదారులు పూర్తిగా లేక సుమారు పది పంచాయతీల పరిధిలో నివసిస్తున్న గిరిజనులు..గిరిజనేతరులు అవస్థలు పడుతున్నారు. దశావతాలు తరబడి తమ గ్రామాలకు వంతెనలు, రోడ్డు సౌక ర్యాలు కావాలని కోరుతున్న దశాబ్దాలుగా వీరి కోర్కెలు నెరవేరడం లేదు. మండలం చీపి గిరిజన గ్రామం వద్ద మహేంద్ర తనయ నది మధ్యలో నిర్మించిన డైవర్షన్ రోడ్డు వద్ద వంతెన పూర్తిగా లేదు.బెల్లు పటియా గ్రామం వద్ద ఉన్న మహేంద్ర తనయ గడ్డ మధ్యలో డైవర్షన్ రోడ్డు ఉన్న వాన కాలంలో ఈ రోడ్డు మీదుగా ఉధృతంగా గెడ్డ నీరు ప్రవ హిస్తుండడంతో ప్రజల రాకపోకలు వాహనాల రాకపోకలు వారాల తరబడి ఉండవు. బొందికరి గిరిజన గ్రామం సమీపంలో ఉన్న వంతెన శిథిలవస్థకు చేరుకుంది. చీపి నుంచి బుడంబు వెళ్లే దారిలో సునాముది గెడ్డపై వంతెన పూర్తిగా లేదు. ఇక్కడ చిన్న డైవర్షన్ రోడ్డు ఉంది. బంజర యువరాజు పురం గ్రామం వద్ద ఉన్న సునా ముది గెడ్డపై వంతెన లేదు. ఇక్కడ కూడా డైవర్షన్ రోడ్డు ఉంది. ఈ డైవర్షన్ రోడ్లన్నీ ఎండకాలం లోనూ చలి కాలంలోనూ ప్రజలు.. గిరిజనులు నడవడానికి మాత్రమే పనికి వస్తాయి. శ్రీనివాసపురం గ్రామానికి వెళ్లాలన్న రహదారి పూర్తిగా లేదు. మహేంద్ర తనయ నదిపై వంతెన కావాలని దశాబ్దాలుగా కోరుతున్నా కానీ ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ నెరవేరడం లేదు. డిమిరియా గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వంతెన శిథిలావస్థకు పూర్తిగా చేరుకుని కుప్పకూలడానికి సిద్ధంగా ఉంది. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లోనూ గిరిజనేతర గ్రామాల పరిధిలో వంతెనలు రహదారులు పూర్తిగా లేకపోవడంతో గ్రామ సచివాలయాలకు వెళ్లడానికి కూడా గిరిజనులు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ వాన కాలంలో రేషన్ సరుకులు డీలర్ వద్దకు వెళ్లి తెచ్చుకోవాలన్న అనేక కష్టాలు పడవలసిందే. వంతెనలు పూర్తిస్థాయి రహదారులు నిర్మాణానికి ప్రతి ఐదేళ్లకు ఓసారి జరుగుతున్న అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రజలకు హామీలు ఇచ్చి ఆ తర్వాత మరచిపోవడమనేది ఆనవాయితీగా మారిపోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా గిరిజన గ్రామాలకు వంతెనలు రోడ్లు నిర్మించి రహదారి సౌకర్యం కల్పిస్తామని హామీలు ఇచ్చి రాజకీయ నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత మరిచిపోతున్నారని గిరిజనుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

గురుభక్తిని చాటిన శిష్యుడు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఆంగ్ల విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా పనిచేస్తున్న డాక్టర్ కె. హరికిషన్ తాను రాసిన పుస్తకాన్ని తనకు విద్యాబుద్ధులు నేర్పిన ఏయూ ఫిలాసఫీ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ జీవీ రాజుకు ఆదివారం గరివిడిలో అందజేశారు. తాను రాసిన ప్రోర్టయల్ ఆఫ్ విమెన్ ఇన్ ఠాగూర్ అనే ఆంగ్ల పుస్తకాన్ని అంకితం చేశారు. విజయ నగరం జిల్లా చీపురుపల్లి మండలం వంగపల్లిపేట గ్రామానికి చెందిన హరికిషన్ బీఆర్ఎ యూలో 20 ఏళ్లుగా అసిస్టెంట్ ప్రొఫెసర్గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా హరికిషన్ మాట్లాడుతూ 96 ఏళ్ల వయసులో కూడా డాక్టర్ జీవీ రాజు ఎంతో వ ఉంది విద్యార్థుల పరిశోధనకు మార్గదర్శిగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. పుస్తకాన్ని అందుకున్న డాక్టర్ జీవీరాజు, హరికిషన్ ను అభినందిస్తూ సత్కరించారు.

దర్జాగా కబ్జా సాగునీటి కాలవ గట్టుమీద కట్టడాలు

విశాలాంధ్ర-ఆమదాలవలస: దురాక్రమనకు కాదేది అనర్హం చివరకు కాలువ గట్టై నా, అక్రమార్కులకు కన్ను పడితే దర్జాగా కబ్జా చేసి అధికారులు ఏ మార్చి నిర్మాణాలు చేపట్టడం పరి పాటిగా మారింది. పైసలిస్తే ఏ పనైనా సాధ్యమేనని అధికారుల చేతివాటంతో మరో మారు నిరూపించు కున్నారు. అనధికార నిర్మాణాలు వాటికి అండగా నిలుస్తున్న అధికారులు ఏం జరిగినా చూసుకుంటా మని పాలకులు ఇంతమంది అండదండలతో ఈ అక్రమ దౌర్జన్య కాండ పట్టణంలో విస్తరించింది. అడ్డు పడితే వారిని బెదిరించి, లేకుంటే పాలకుల వద్ద వారి పై శాడీలు చెప్పి వారిని బదనాం చేసే ప్రయత్నంలో కృత కృత్యులతున్నారు. వారి అక్రమ నిర్మాణాలకు ఎటువంటి పత్రాలు లేకున్నప్పటికి క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా అక్రమార్కులు వ్యవహరిస్తున్నా రు. దీనికోసం సచివాలయ సిబ్బంది కొంత మొత్తా లను వసూలు చేసి ప్లానింగ్ సెక్రటరీ తో కలిసి వాటా లు పంచుకోవడం పరిపాటిగా మారింది. నిర్మాణం చేస్తున్న స్థలం ప్రభుత్వానిది, రిజర్వు స్థలం, రివర్ బెడ్ కు చెందిన బఫర్ జోన్ అని చూడకుండా డబ్బు లు తీసుకొని ప్లానింగ్ సెక్రటరీలో అనుమతులు ఇస్తు న్నట్లు తెలిసింది. పట్టణ ప్రాంతం పార్వతీశంపేట రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 248 లో మూడు లో కామిరెడ్డి ఆదినారాయణ అక్రమ నిర్మాణం చేసి విక్రయించారు. ఆ పక్కనే ఉన్న సర్వే నెంబర్ 248 లోని నాలుగు ఐదు భాగాల్లో ఎర్రమనాయుడు మరో అదనపు భవనాన్ని నిర్మాణం చేపట్టారు. బఫర్ జోన్ లో ఉన్న వాటికి మున్సిపల్ ప్లానింగ్ అధికారులు ఏ రకంగా అనుమతిని ఇచ్చారు అనేది మిలియన్ డాలర్ ప్రశ్న. సర్వే నెంబర్ 248లో 2003 సంవత్స రం వయోడక్ట్ కి అనుసంధానంగా లక్ష్ముడు పేటకు వెళ్లే సాగునీటి కాలువ నిర్మాణానికి ఇరిగేషన్ శాఖ (వంశధార పరిధి) కాలవ నిర్మాణం కోసం భూమిని సేకరించారు. అందుకు తగిన పరిహారం చింతాడ ఎర్రమనాయుడుకు, కామిరెడ్డి ఆదినారాయణ కు హక్కుదారులకు అవార్డు పాస్ చేశారు. అందుకు తగిన మొత్తాన్ని కూడా వారికి చెల్లించారు. ఇదిలా ఉండగా బఫర్ జోన్ గా ఉన్న ప్రాంతాన్ని తమ సొంత స్థలాలంటూ దౌర్జన్యంగా దురాక్రమణ చేసి దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపట్టడం విశేషం. దాన్నే తమ భూమిగా చూపిస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతు న్నారు. దీనికి సంబంధించిన పత్రాలు నిర్మాణదారుని వద్ద ఉన్నట్లు ఇప్పటికే ఒక ఇంటిని విక్రయం చేశారు. బఫర్ జోన్ లో ఇల్లు కట్టకూడదని తెలిసిన నిర్మాణా లకు ఏ విధంగా అనుమతించారు తెలియాల్సి ఉంది. ఇలా ప్రభుత్వ భూములు నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి ప్రభుత్వానికి నష్టం కలిగే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. కబ్జాదారులు విన్యా సాలకు ప్రభుత్వ ధనం వృధా అవుతుంది. ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధితో వ్యవహరించినప్పటికీ కొందరు అక్రమార్కుల కారణంగా స్థానిక నాయకులు పై ఈ ప్రభావం పడుతుంది. 23 ఎల్ పిల్ల కాలువ నిర్మా ణానికి కేటాయించిన స్థలంలో అక్రమార్కులు దర్జాగా కబ్జా చేస్తే అధికారులు అటువైపు కన్నెత్తి చూడక పోవడం వెనక పలు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. రెవెన్యూ అధికారి అటువంటి చుక్కల భూములకు అనుమతులు అందిస్తూ ఆ ప్రాంతాన్ని వారి పేరిట వన్ బి వచ్చే విధంగా చూస్తున్నారు. ఆ నలుగురు వ్యక్తులు ఒక్కటై ఖరీదైన భూములను కబ్జా చేస్తున్నారు. ప్రభుత్వం గత వైసిపి కాలంలో, అంతకుముందు తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఇల్లు లేని నిరుపేదలకు అందించిన స్థలాల్లో వీరి బినామీ పేర్లే అధికంగా కనిపిస్తాయి. అంతేకాకుండా గతంలో ప్రభుత్వం పేదలకు అందించేందుకు భూ సేకరణ చేసినప్పుడు రెవెన్యూ అధికారుల పేరిట పట్టా భూములను ప్రభుత్వానికి అందించి సొమ్ము చేసుకున్న వైనం వెలుగులోకి వచ్చినప్పటికీ అప్పట్లో అధికారులు వాటిని ప్రభుత్వానికి తప్పుడు సమాచా రం అందించి ఆ ఫైల్ క్లోజ్ చేశారు. అందుకు స్టాంప్ వెండర్ కావలసిన డాక్యుమెంట్ జత చేసి రిజిస్టర్ కార్యాలయంలో అందిస్తున్నట్లు తెలిసింది. అధికా రులకు మూలవానిపేట, శ్రీహరిపురం ప్రాంతాలకు చెందిన కొంతమంది వ్యక్తులు వాటిని సరిచేసి విక్ర యాలు చేసుకుని ఈ నలుగురు పంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ నలుగురు కొనసానల్లోనే ప్రభుత్వ భూములు ఇతర వ్యక్తుల పేర్లు ఉన్న భూములు వీరి పరమై లబ్ది పొందుతున్నట్లు తెలుస్తుంది. అధికారుల అండ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ భూము లు కబ్జాకు గురవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు పరిశీలన చేసి చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ఆస్తులు కాపాడాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర-లావేరు: రణస్థలం మండలం 16 వ నెంబరు జాతీయరహదారి బ్రిడ్జి నిర్మాణం జరుతున్న ప్రదేశంలో బైక్ అదుపుతప్పి బ్రిడ్జి పనులు చేస్తున్న గోతులో పడి యువకుడు దుర్గాసి నరసింగరావు (23) ఆదివారం తెల్లవారి జామున మృతి చెందినట్టు జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మృతుడు లావేరు మండలం వేణుగోపాలపురం వాసిగా గుర్తించి ద్విచక్ర వాహనం రణస్థలం తహశీల్దారు కార్యాలయం రోడ్డున వస్తుండగా అదుపు తప్పి గోతులో పడి మరణించాడు.

వృద్ధులకు రగ్గులు పంపిణీ

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : యువసూర్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు రగ్గులకు పంపిణీ చేసారు. ట్రస్ట్ ఛైర్మన్ న్యాయవాది ఎం. రాంబాబు ఆధ్వర్యంలో కొళిగాం గ్రామంలో 80 మంది పేదలకు ఇచ్ఛాపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, 1వ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్ కుమార్‌ల చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతు ఇప్పటి శీతాకాలంలో చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున చాలా మంది ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతున్నారని, దాన్ని గమనించి పేదలకు తోడుగా ఉండే ఉద్దేశ్యంతో ట్రస్ట్ ఛైర్మన్ రాంబాబు స్పందించి రగ్గుల పంపిణీ చేపట్టారని, అతని ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలు ఎనలేనివని అన్నారు. ఆదాయం కంటే తోటి వారికి సేవ ద్వారా ఆనందం పొందాలనుకునే రాంబాబు సేవలు ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమం లో పాయతారి, కీర్తిపురం, కొళిగాం పంచాయితీ పెద్దలు ,యువకులు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రపంచం మెచ్చిన నాయకుడిని ఎవడెవడో విమర్శిస్తుంటే భాదేస్తుంది

- కేంద్ర మంత్రివర్గంలో టాప్ ఫైవ్ లో మన రామ్మోహన్ నాయుడు అంటూ కితాబు
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలను ఉత్సవంలా జరపాలి
- ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: కేంద్ర మంత్రిగా తన శాఖ వృద్ధికి రామ్మోహన్ నాయుడు విశేషంగా కృషి చేస్తూ ఉంటే ఏవియేషన్ అంటే ఏమిటో తెలియని వ్యక్తులు, చివరకి మీసాలు రాని వారు కూడా విమర్శిస్తుంటే భాధగా అనిపించిందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈనెల 18న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా జరపాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం కేంద్ర మంత్రి క్యాంప్ కార్యాలయంలో జన్మదిన ఉత్సవాలకు సంబంధించి సన్నాహక కమిటీ సమావేశం జరిగింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల కీలక నేతలు, శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొని.. ఉత్సవాలకు సంబంధించి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి మాట్లాడుతూ భావోద్వేగం అయ్యారు. రాష్ట్రంలో ఓ వర్గం రామ్మోహన్ నాయుడు పై విమర్శలు చేస్తున్న తరుణంలో టిడిపి శ్రేణులు అన్నీ బలంగా వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎవరెన్ని విమర్శలు చేసిన.. పని చెయ్యడమే తన అలవాటుగా చేసుకున్న రామ్మోహన్ నాయుడు భవిష్యత్ లో దేశ విమానయాన రంగాన్ని ప్రపంచంలోనే మరింత ఉన్నత స్థానంలో నిలుపుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో ఎర్రన్నాయుడు తో తనకున్న అభిమానాన్ని గుర్తు చేసుకుంటూ శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కన్నీటి పర్యంతం అయ్యారు. తనను ఓ కొడుకులా చుసుకునేవారని చెప్పి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అయన లేని లోటును ఇటు పార్టీకి, అటు దేశానికి తీర్చే వ్యక్తిగా రామ్మోహన్ నాయుడు నిలిచారని కితాబిచ్చారు. ఎవరెన్ని విమర్శలు చేసిన అటు ప్రధాని మోదీ, ఇటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యధిక ప్రాధాన్యత కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకి ఇస్తున్నారంటే అందుకు ఆయన పనితీరు నిదర్శనం అని స్పష్టం చేశారు. తఈ నెల 18వ తేదిన జరగబోయే రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకను.. దేశ వ్యాప్తంగా అయన అభిమానులు, టిడిపి శ్రేణులు ఘనంగా జరుపుతున్న నేపథ్యంలో.. శ్రీకాకుళం నియోజకవర్గంలో కూడా గతంలో కంటే ఘనంగా ఈసారి జరపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం నగర టిడిపి నాయకులు, వివిధ కార్పోరేషన్ల స్టేట్ డైరక్టర్లు, డివిజన్ ఇంచార్జిలు, గార, శ్రీకాకుళం రూరల్ మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పన్నులకు పంగనామాలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : సాధారణంగా వ్యాపారంలో లాభాలు ఆశించడం సహజం. అది రాజ మార్గంలో ప్రభుత్వ చట్టాలకు అనుగుణంగా మాత్రమే ఉండాలి. వీటన్నింటికీ అతీతంగా ప్రభుత్వ నిబంధనలను పాతరేసి అడ్డదారి సంపాదనే మాకు రహదారి అనుకునేవారు సమాజంలో ఎంతో మంది మనసుకు నిత్యం తారసపడుతుంటారు. బహుశా ఈకోవలోకె జిల్లాలోని కొందరు మెడికల్ షాపుల యజమానులు వస్తారేమో అన్నది మందుల కొనుగోలుదారుల అభిప్రాయంగా ఉంది. తమ సంపాదన కోసం ప్రభుత్వ పన్నులు పెద్ద ఎత్తున ఎగవేస్తున్నట్లు మెజారిటీ మెడికల్ షాప్ ల యజమానులపై ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం కంపెనీల నుండి మీరు కొనుగోలు చేసిన ప్రతి టాబ్లెట్ కు ఒక రిజిస్టర్ను మెయింటైన్ చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా ట్యాబ్లెట్లు ఎవరికి అమ్మేమన్నా వివరాలతో కూడిన రిజిస్టర్ కూడా నిర్వహించాల్సి ఉంటుంది. ఈ రిజిస్టర్ల నిర్వహణ లో ఎన్నో అవకతవకలు, అక్రమాలు చోటు చేసుకుంటున్నయని పలువురు రోగులు, వారి బంధువులు అభిప్రాయపడుతున్నారు. వైద్యుడి ప్రెస్క్రిప్షన్ మేరకు మాత్రమే మందులు విక్రయించాలని నిబంధన ఉన్నప్పటికీ అందుకు విరుద్ధంగా పెద్ద ఎత్తున కౌంటర్ సేల్స్ జరపడం బహిరంగ రహస్యం. ఇందులో యాంటీ బయోటిక్స్, స్టెరాయిడ్స్, నిద్ర మాత్రలు, ఇతర సున్నితమైన మందులు కూడా ఉంటున్నాయని పలువురు రోగులు తెలియజేస్తున్నారు. ఇవే రిజిస్టర్ లో అవకతవకులకు పెద్ద ఉదాహరణ అని వారు చెప్తున్నారు. మరోవైపు అనధికారికంగా అడ్డదారిలో వచ్చిన మందులతో పాటు పెద్ద ఎత్తున నకిలీ మందులు కూడా జిల్లాలో విక్రయాలు జరుగుతున్నాయి అన్న ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. వీటి వివరాలు ఏవి రిజిస్టర్లలో పూర్తిగా నమోదు కావు. వీటి అమ్మకాలు సంబంధించి ఎటువంటి వివరాలు అందుబాటులో లేని నేపథ్యంలో అసలు ప్రభుత్వ పన్నులు కట్టాల్సిన అవసరమే లేదన్నది సగటు వినియోగదారుడి అభిప్రాయంగా ఉంది. అంటే ఇది అక్రమ సంపాదనే అన్నది వారి భావన. ఇప్పటికైనా జిఎస్టి విభాగం అధికారులు స్పందించి మెడికల్ షాపుల్లో రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకుండా పన్నులు ఎగవేస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రూ. 2.23 లక్షల చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-పలాస: పేదబడుగుబలహీనవర్గాలప్రజలువివిధరకాలకారణాలతోఆర్థికఇబ్బందులు,సమస్యలతోసతమతమవుతున్నతరుణంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం రూ. 2.23 లక్షల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొందర కవిత పాత్రో రూ. 60,000 లు, దుమ్ము ఏకాంబరం రూ. 60,752 లు, అనురాధ పాణిగ్రహి రూ. 46,084 లు, కంచరాన కిరణ్ కుమార్ రూ. 56,441లు చొప్పున చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు గాలి కృష్ణారావు దువ్వాడ సంతోష్ కుమార్ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వరిచేనుకుప్ప దగ్ధం

విశాలాంధ్ర-నందిగాం : మండలం నందిగాం పంచాయతీ పెంటూరు గ్రామానికి చెందిన మట్ట రామారావుకి చెందిన 50 సెంట్ల భూమిని అదే గ్రామానికి చెందిన బంగారి శిమ్మయ్య కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. ఈ భూమి నరేంద్రపురం పంచాయతీ పాలవలస గ్రామ బౌండరీలో ఉంది. కోత కోసి కుప్ప పెట్టిన వరి చేను ప్రమాద నికు గురి కావడం తో రైతు కన్నీరు మున్నీరు అయ్యారు. ఆదివారం కాలి బూడిదయ్యింది. తహసీల్దారు పి సోమేశ్వరరావు పరిశీలించి రూ.30 వేలు నష్టం వాటిల్లినట్లుగా అంచనా వేశారు.

కళింగ చరిత్రను చాటి చూపుదాం

- 28వ తేదీన కళింగ ఆత్మీయ కలయిక కు పిలుపు
- కళింగ సామాజిక వర్గాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేద్దాం

విశాలాంధ్ర-టెక్కలి: కళింగ చరిత్రను చాటి చూపుదామని శ్రీకాకుళం జిల్లా కళింగ అధ్యక్షులు కూన సూర్యం అన్నారు. మండలంలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో టెక్కలి పరిసర ప్రాంతాల కలయిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళింగ వర్గానికి సంబంధించి ఆత్మీయ కలయిక (వనభోజనం) ఈ 28వ తేదీన ఎచ్చెర్ల లో జరుగుతుందని, ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మనమందరం కలిసికట్టుగా ఉండాలని, శ్రీకాకుళం జిల్లా అంటేనే కళింగలు అని

కొనియాడారు. వర్గం బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ కృషి చేయాలని గ్రామాలలో ఉన్న మన కళింగ లును ఏకం చేయాలని పేర్కొన్నారు. అనంతరం టెక్కలి కళింగ సభ్యులు మాట్లాడుతూ తప్పనిసరిగా బొడ్డేపల్లి రాజగోపాల్ విగ్రహాన్ని తప్పనిసరిగా టెక్కలిలో త్వరలోనే స్థాపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోదులవలస రమేష్, సనపల అన్నాజీ రావు, కొత్తకోట శ్రీనివాసరావు, మెట్ట రామారావు, ఐజి వజ్జ వేణుగోపాలరావు, దువ్వాడ జీవితేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, కిల్లి కృపారాణి, రామ్మోహన్ నాయుడు, దువ్వాడ శ్రీధర్ బాబా, సత్తారు వెంకటరమణ, కోత మధు, కోత సతీష్, బొడ్డేపల్లి నేతాజీ, కణితి కిరణ్ కుమార్, చింతాడ పార్వతీశం టెక్కలి ఆర్గనైజేషన్ సభ్యులు సంపతి రావు జగదీష్, సిపాన శీను బాబు, డిక్కల రామకిషోర్ తదితర కళింగ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పిఆర్సి కమిటీ తక్షణమే నియమించాలి

ఏపీపీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్

విశాలాంధ్ర-పలాస: ఉద్యోగులకు పిఆర్సి కమిటీ తక్షణమే నియమించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ వి అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పి రామన్ నాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఏ పి టి ఎఫ్ పలాస మండల శాఖ సర్వసభ్య సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యస్ వి అనిల్ కుమార్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు నిర్దేశించబడిన 100 రోజుల ప్రణాళిక పునః సమీక్ష చేసి స్థానిక పరిస్థితులకు అనుకూలంగా అమలు చేసే వీలుగా ప్రధానోపాధ్యాయులకు అవకాశం ఇప్పించాలని. విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి గురికాబడుతున్నందున ఆదివారాలు సెలవు దినములుగా మినహాయించాలని అన్నారు. పాఠశాలల్లో మనబడి నాడు నేడు పనులు సుమారు రెండు సంవత్సరాలుగా నిధులు మంజూరు చేయని కారణంగా పనులు నిలిచిపోయాయని తక్షణమే ఆ నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పిఆర్సి కమిటీ తక్షణమే నియమించాలని ఐ ఆర్ ప్రకటించాలని పెండింగ్ లో ఉన్న డి ఏ లు చెల్లించాలని మూడు ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలు మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు అన్ని వెంటనే విడుదల చేయాలని ఆయన అన్నారు. అనంతరం పలాస మండల శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలాస మండల శాఖ ఎన్నికలు గవ్వ భీమారావు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఎన్నికలలో పలాస మండల అధ్యక్షునిగా టి రామ నాయుడు ప్రధాన కార్యదర్శిగా టీవీఎస్ నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సుభాష్ బాబు జిల్లా ఉపాధ్యక్షులు కె గోపికృష్ణ రాష్ట్ర కౌన్సిలర్ జి రాజేష్ మాజీ జిల్లా కార్యదర్శి పి వి రమణ తో పాటు ఉపాధ్యాయులు మహిళా ఉపాధ్యాయులు వివిధ మండలాల ఏపీటీఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.అధ్యక్ష వర్గంలో కే వెంకటరావు కే వరలక్ష్మి ఎస్ భీమశంకర్ రావు ఈశ్వరరావు కార్యదర్శులుగా ఎస్ రవికుమార్ భవాని,కృష్ణచంద్ర పాత్రో,సంతోష్ కుమార్ జిల్లా కౌన్సిలర్ గా మాధవ బెహరా హేమాంబర రావు గున్నయ్య తిన్నారా గోపాలరావు సులోచన నారాయణరావు పాపారావు ఇంద్రతన్య కృష్ణారావు రామకృష్ణ ధనుంజయ ఆడిట్ ఈశ్వరరావు గౌతముడు జానకిరామ్ స్టాఫ్ డి మురళీమోహన్ కే సింహాచలం గార్లను కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

కొనసాగుతున్న వ్యవసాయ విద్యార్థుల క్రీడల పోటీలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలోని కళాశాలల విద్యార్థుల క్రీడలు, సాంస్కృతిక, లిటరరీ మీట్ పోటీలు మండలంలోని ఎస్ఎస్ఆర్పురంలోని శ్రీత కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలలో కొనసాగుతున్నాయి. ఈ పోటీలు ఈ నెల 12వ తేదీన ప్రారంభం కాగా, 15వ తేదీలోగా ముగుస్తాయి. మూడో రోజైన ఆదివారం పుట్బాల్, క్రికెట్, అథ్లెటిక్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎల్. నారన్నాయుడు పర్యవేక్షణలో ఈ పోటీలు జరుగుతున్నాయి.మూడో రోజు ఫలితాల వివరాలుజావెలిన్ త్రోలో కిరణ్ కుమార్ (శ్రీ కింజరాపు ఎర్రన్నాయుడు కళాశాల), పి.నిఖిల్ (బాపట్ల), రామానుజనాయక్ (రాజమండ్రి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. రన్నింగ్ 400 ఇన్యూ 100 మీటర్లలో ప్రథమ నైర వ్యవసాయ కళాశాల, ద్వితీయ శ్రీ కింజరాపు ఎర్రన్నాయుడు కళాశాల, తృతీయ మహానంది వ్యవసాయ కళాశాల (కర్నూలు) విద్యార్థులు సాధించారు. ట్రిపుల్ జంప్‌లో ప్రథమ బి.చంద్రశేఖర్ (బాపట్ల), ద్వితీయ నిర్మల్ (శ్రీ వెంకటేశ్వర కళాశాల తిర పతి), తృతీయ వి. లక్ష్మణ (ఉదయగిరి) సాధించారు. 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ అక్షయజైన్ (తిరుపతి), ద్వితీయ భాను ప్రకాష్ (నైర), తృతీయ వైకుంఠ లక్ష్మణ్ (ఉదయగిరి) చేజిక్కించుకున్నారు.

ఉత్తరాంధ్ర నుదుటన విజయ తిలకం

-తిలకంలో జిల్లా నటులకు అవకాశం ఉంటుంది

- డైరెక్టర్ షకలక శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఎస్ శంకర్ ఫిలిం ఆధ్వర్యంలో రూపొందుతున్న విజయ తిలకం సినిమా ఉత్తరాంధ్ర నుదుటన తిలకం దిద్దనుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఉన్న ఎస్ఎస్ క్రిస్టల్ ప్యాలెస్ లో తిలకం సినిమా టైటిల్ ను సినిమా దర్శకుడు షకలక శంకర్ తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా నుండి కళా రంగంలో రాణించి బుల్లితెరలో జబర్దస్త్ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది అభిమానులను షకలక శంకర్ సంపాదించు కున్నారన్నారు. ప్రస్తుతం డైరెక్షన్ వైపు తన ప్రస్థానాన్ని ప్రారంభించిన షకలక శంకర్ గొప్ప సందేశాత్మక చిత్రాలు నిర్మించి జిల్లా కీర్తిని మరింతగా ఇనుమడింప చేయాలన్నారు. ఇప్పటివరకు తనకు హీరోగా, సహనటుడుగా ఎంతో సహకరించిన ప్రేక్షకులు తిలకం సినిమాను కూడా ఆదరించి తనను ప్రోత్సహించాలని కోరారు. ఈ సినిమా కోసం పని చేస్తున్న ప్రతి ఒక్కరిది ఈ చిత్రమని చిత్రంలోని నటులు, సాంకేతిక సిబ్బందికి కూడా ఈ చిత్రాన్ని అంకితమిస్తున్నానన్నారు. సినీ రంగం పైన కళాకారుల పైన తనకు ఎంతటి గౌరవం ఉందో ఎమ్మెల్యే మాటల్లో అర్థమైందని చెప్పారు. జిల్లాపై ఉన్న మక్కువతో ఈ చిత్రంలో జిల్లాలోని నటులకు, కళాకారులకు అవకాశం కల్పిస్తున్నట్టు వివరించారు. చిత్ర నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాసరావు, టిడిపి నగర అధ్యక్షులు పాండ్రంకి శంకర్, డాక్టర్ పిజె నాయుడు, తైక్వాండో శ్రీను, టిడిపి నాయకులు పి ఎం జె బాబు, మైలపిల్లి నరసింహామూర్తి, నాగేంద్ర యాదవ్, కరగాన భాస్కరరావు, కోరాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెయ్యి చెయ్యి కలిపి - గంజాయి రహిత సమాజం నిర్మిద్దాం

-ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి

- అభ్యుదయం సైకిల్ యాత్రలో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలి.ఎస్పీ పిలుపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: గంజాయి వంటి మత్తు పదార్థాలు నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో (పాయకరావు పేట నుంచి ఇచ్ఛాపురం వరకు)సాగుతున్న “అభ్యుదయం సైకిల్ యాత్ర” డిసెంబర్ 16 తేదీ మంగళవారం ఉదయం శ్రీకాకుళం పట్టణంలోకి ప్రవేశిస్తునట్లు ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సైకిల్ యాత్రకు ప్రజలు, ముఖ్యంగా యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఎర్రన్నాయుడు ఆర్చ్ జంక్షన్, డే అండ్ నైట్, రామలక్ష్మణ సూర్యమహల్, జి.టి రోడ్డు, సెవెన్ రోడ్డు జంక్షన్, ఎన్.టి.ఆర్ మున్సిపల్ హై స్కూల్ మైదానం వద్ద భారీ బహిరంగ సభ, సైకిల్ యాత్ర అనంతరం ఎన్.టి.ఆర్ మున్సిపల్ హై స్కూల్ మైదానంలో భారీ బహిరంగ అవగాహన సభ నిర్వహించబడుతుంది. గంజాయి వంటి మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని, సమాజం గంజాయి రహితంగా మారేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలు, యువత, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా పోలీసు శాఖ విజ్ఞప్తి చేస్తోంది.